## రామయ్య దర్శనానికి రాష్ట్రాలకు స్లాట్లు!

**రద్దీ నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ యోచన**

అయోధ్య, జనవరి 26: అయోధ్య శ్రీరాముడి దర్శనానికి భక్తుల రద్దీ భారీగా ఉన్నందున రాష్ట్రాల వారీగా స్లాట్లు కేటాయించాలని శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు భావిస్తున్నది. ఒక్కో రాష్ట్రానికి షెడ్యూల్ కేటాయించేలా, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆహ్వానాలు పంపేందుకు రెడీ అయ్యింది. ఆయా తేదీలు, సమయాల్లోనే ఆయా రాష్ట్రం నుంచి భక్తులను దర్శనానికి పంపేలా ఏర్పాట్లు చేయాలని కోరనున్నట్టు తెలిసింది. స్లాట్లు కేటాయిస్తే భక్తుల రద్దీని నియంత్రించేందుకు వీలు అవుతుందని ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అటు.. భక్తుల రద్దీ తగ్గాక ఎన్నారైలను ఒకేసారి రామయ్య దర్శనానికి ఆహ్వానించాలని ట్రస్టు భావిస్తున్నది.

**బాలక్ రామ్‌కు రాగ సేవ**

బాలక్ రామునికి రాగ సేవ శుక్రవారం ప్రారంభమైంది. మార్చి 10 వరకు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ సంప్రదాయాలకు చెందిన దాదాపు 100 మంది ప్రముఖ సంగీత కళాకారులు పాల్గొంటారు. హేమ మాలిని, మాలిని అవస్థి, అనూప్ జలోటా, అనురాధ పౌడ్వాల్, సోనాల్ మాన్‌సింగ్, వైజయంతిమాల తదితరులు కళాకారుల జాబితాలో ఉన్నారు..

## 'బాలక్‌రామ్' శిలను వెలికితీసిన వ్యక్తికి జరిమానా

బెంగళూరు: అయోధ్య బాలరాముడి విగ్రహాన్ని రూపొందించేందుకు వందల కోట్ల ఏండ్ల నాటి కృష్ణ శిలను(నల్ల రాయి) గుర్తించినందుకు శ్రీనివాస్ నటరాజ్ అనే చిన్న కాంట్రాక్టర్‌కు కన్నీరు మిగిలింది. ఒక ప్రైవేట్ స్థలంలో అక్రమంగా మైనింగ్ చేశారని ఆరోపిస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మైనింగ్, భూగర్భ శాఖ ఆయనకు రూ.80 వేల జరిమానా విధించింది. జరిమానాను చెల్లించేందుకు శ్రీనివాస్ తన భార్య బంగారం నగలను తాకట్టు పెట్టాల్సి వచ్చిందని స్థానిక మీడియా పేర్కొన్నది. మైసూర్ సమీపంలోని గుజ్జెగౌదనపుర అనే గ్రామానికి చెందిన రామదాస్ అనే రైతుకు చెందిన పొలంలో రాళ్లను తొలగించేందుకు శ్రీనివాస్‌కు ఒక కాంట్రాక్టు వచ్చింది. ఈ క్రమంలో ఒక పెద్ద రాయిని మూడు భాగాలుగా చేశామని, అందులో ఒకదాన్ని బాలక్‌రామ్ విగ్రహ రూపకల్పన కోసం ఎంచుకొన్నారని శ్రీనివాస్ నటరాజ్ తెలిపారు.

## త్వరలో విజయ్ కొత్త పార్టీ?



చెన్నై, జనవరి 26: రాజకీయ రంగ ప్రవేశానికి తమిళనాడు చెందిన ప్రముఖ నటుడు విజయ్ సిద్ధమయ్యారనే వార్తలు వస్తున్నాయి. త్వరలో ఆయన కొత్త పార్టీ ప్రారంభించే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. గురువారం చెన్నైలో జరిగిన విజయ్ అభిమాన సంఘం 'విజయ్ మక్కల్ ఇయక్కం' జనరల్ కౌన్సిల్ సమావేశం కూడా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ వార్తలు రావడం గమనార్హం. ఒక నెలలో కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేయనున్నట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## మైక్రోసాఫ్ట్‌లో మరో 1900 మందిపై వేటు

**సంస్థకు సీనియర్ ఉద్యోగుల గుడ్‌బై**

న్యూఢిల్లీ: అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉంది. తాజాగా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన గేమింగ్ విభాగంలో 1900 మందిని(మొత్తం ఉద్యోగుల్లో 8 శాతం) తొలగించాలని నిర్ణయించింది. గేమింగ్ విభాగంలోని యాక్టివిజన్ బ్లిజార్డ్, ఎక్స్ బాక్స్ డివిజన్లలోనూ కోతలుంటాయని కంపెనీ తెలిపింది. ఇది బాధాకర నిర్ణయమైనా ఆపరేషన్లను క్రమబద్ధీకరించడానికి, కొత్త ప్రాజెక్టులపై దృష్టి పెట్టడానికి ఇది తప్పదని తెలిపింది. ఇదే సమయంలో కంపెనీలో కీలక పాత్ర పోషించిన బ్లిజార్డ్ అధ్యక్షుడు మైక్ యబ్రా, చీఫ్ డిజైనింగ్ ఆఫీసర్ అల్లెన్ అడమ్ కంపెనీని వీడాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో బ్లిజార్డ్‌కు వచ్చే వారం కొత్త ప్రెసిడెంట్‌ను నియమిస్తామని మైక్రోసాఫ్ట్ తెలిపింది. కీలక అధికారులు సంస్థను వీడటం, సంస్థాగత మార్పుల కారణంగా ఒక గేమ్ ప్రాజెక్టును బ్లిజార్డ్ రద్దు చేసింది.

**సేల్స్ ఫోర్స్‌లో 700 మంది ఇంటికి!**

అమెరికాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ సేల్స్‌ఫోర్స్ 700 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ శుక్రవారం ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది.



రిపబ్లిక్ డే కవాతులో భారత ఆర్మీకి చెందిన డేర్ డెవిల్స్ మహిళల బృందం సాహసోపేత ప్రదర్శనలు (ఇన్‌సెట్‌లో ఆర్మీకి చెందిన యుద్ధ ట్యాంకులు)

# నారీశక్తికి వందనం

**కర్తవ్యపథ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు**

- అబ్బురపరిచిన ఆయుధ శక్తి ప్రదర్శన
- పరేడ్ మొత్తం మహిళా శక్తి దర్శనం
- త్రివిధ దళాలను లీడ్‌చేసిన మహిళలు

న్యూఢిల్లీ, జనవరి 26: భారత గణతంత్ర వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన ప్రధాన వేడుకలు అసలైన భారతీయతను ఆవిష్కరించటంతోపాటు దేశ సైనిక, ఆయుధ పాటవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. ఈసారి వేడుకలు మొత్తాన్ని మహిళా అధికారులే ముందుండి నడిపించటం విశేషం. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మెక్రాన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలు భారత ప్రధాన లక్షణమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి. 'వికసిత్ భారత్', 'భారత్-లోక్‌తంత్ర్ కా మాతృక' థీమ్‌తో వేడుకలు నిర్వహించారు.

**నింగి, నేల మహిళా శక్తి**

శుక్రవారం ఉదయం ప్రధాని మోదీ నేషనల్ వార్ మెమోరియల్ వద్ద అమరులకు నివాళులు అర్పించటంతో వేడుకలు మొదలయ్యాయి. సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకల అతిథి మెక్రాన్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా కర్తవ్యపథ్‌కు తోడ్కొని వచ్చారు. అక్కడ జాతీయ పతాకం ఆవిష్కరించిన తర్వాత త్రివిధ దళాల వందనాలు, భారత ఆయుధ సంపత్తి ప్రదర్శనతోపాటు 100 మంది భారతీయ మహిళా సంగీత కళాకారులు వివిధ రకాల శాస్త్రీయ సంగీత వాయిద్యాలతో అలరించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర శాఖల శకటాలు అందరినీ ఆకర్షించాయి. గిరిజన ఉద్యమాల ఇతివృత్తంతో ఏర్పాటుచేసిన తెలంగాణ శకటం విశేషంగా ఆకట్టుకొన్నది. ఈ వేడుకలకు త్రివిధ దళాల అధిపతులు, కేంద్ర మంత్రివర్గంతోపాటు వివిధ దేశాల రాయబారులు, ప్రముఖులు, సామాన్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**ముందుండి నడిపించారు**

గణతంత్ర వేడుకల్లో తొలిసారి త్రివిధ దళాల కంటింజెంట్లకు మహిళలు నాయకత్వం వహించారు. కంటింజెంట్లన్నింటికీ ఆర్మీ మిలిటరీ పోలీస్‌కు చెందిన కెప్టెన్ సంధ్య నాయకత్వం వహించగా, మూడు విభాగాలను ప్రత్యేకంగా కెప్టెన్ శరణ్యరావ్, సబ్ లెఫ్టినెంట్ అన్షు యాదవ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శ్రిష్టి రావ్ ముందుండి నడిపించారు. ఆర్మ్డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ కంటింజెంట్‌కు మేజర్ శ్రిష్టి కుల్లర్ నాయకత్వం వహించారు. ఆర్మీ డెంటల్ కార్ప్స్‌కు అంబా సమంత్, ఇండియన్ నేవీకి సర్జన్ లెఫ్టినెంట్ కాంచన, ఎయిర్‌ఫోర్స్‌కు ఫ్లైట్ లెఫ్టినెంట్ దివ్యప్రియ నాయకత్వం వహించారు. సైన్యానికి చెందిన మద్రాస్ రెజిమెంట్, గ్రెనెడియర్ రెజిమెంట్, రాజ్‌పుత్ రైఫిల్స్, సిక్కు రెజిమెంట్, కుమావున్ రెజిమెంట్ ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. నేవీకి చెందిన 144 మంది మహిళ, పురుష అగ్నివీర్స్‌తో కూడిన కంటింజెంట్‌కు లెఫ్టినెంట్ ప్రజ్వల్ నాయకత్వం వహించారు.

**అత్యాధునిక ఆయుధ ప్రదర్శన**

భూమి నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ అస్త్ర, తేలికపాటి యుద్ధ విమానం తేజస్, రాడార్ వ్యవస్థ ఉత్తమ్, అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థ, శక్తి సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను ప్రదర్శించింది. టీ-90 బ్రహ్మ యుద్ధ ట్యాంకులు, కొండ ప్రాంతాల్లో కూడా పనిచేయగల వాహనాలు, ఆయుధాలను గుర్తించే రాడార్ వ్యవస్థ స్వాతి తదితర ఆయుధ సంపత్తిని చూసి ఆహుతులు పులకించారు. రెండు రాఫెల్ యుద్ధ విమానాలు, ఫ్రాన్స్‌కు చెందిన 93 మంది సభ్యుల మార్చింగ్ కంటింజెంట్, 30 మంది సభ్యులతో కూడిన బ్యాండ్ కంటింజెంట్ వేడుకల్లో భాగస్వామ్యమయ్యాయి. వేడుకల ముగింపులో ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 46 విమానాలు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి.

**భారతీయ సంగీతానికి పట్టం**

గణతంత్ర వేడుకల్లో తొలిసారి భారతీయ సంగీతం అలరించింది. ఆవాహన్ పేరుతో 100 మంది సంగీతకారిణులు వివిధ రకాల సంగీత పరికరాలతో ప్రదర్శన ఇచ్చారు.



రిపబ్లిక్ డే ఉత్సవాల్లో సైనిక దళాల నుంచి వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ. కవాతును తిలకిస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

## భారత విద్యార్థులకు మెక్రాన్ కానుక

**ఫ్రాన్స్‌లో 30 వేల మంది విద్యాభ్యాసానికి సహకారం**

న్యూఢిల్లీ, జనవరి 26: భారత గణతంత్ర దిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్ భారత విద్యార్థులకు తీపి కబురు అందించారు. 2030 నాటికి ఫ్రాన్స్‌లో 30 వేల మంది భారత విద్యార్థులు చదవాలన్నదే తమ లక్ష్యమని ప్రకటించారు. 'ఇది ఉన్నతమైన లక్ష్యం, కానీ దీన్ని సాకారం చేయాలని నేను నిర్ణయించుకున్నాను' అని ఎక్స్‌లో శుక్రవారం ఆయన పోస్ట్ చేశారు. తమ దేశ విశ్వవిద్యాలయాల్లో చదువుకొనే ఫ్రెంచ్ మాట్లాడలేని విద్యార్థుల కోసం అంతర్జాతీయ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఫ్రాంచైజీల నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తామన్నారు. 'మా దేశంలో చదువుకున్న మాజీ భారత విద్యార్థులకు వీసా మంజూరు చేయడాన్ని సులభతరం చేస్తాం' అని మెక్రాన్ పేర్కొన్నారు.




## 40 ఏండ్ల తర్వాత మళ్లీ బగ్గీలో..

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ బుల్లెట్ ప్రూఫ్ కాన్వాయ్‌లో కాకుండా సంప్రదాయ బగ్గీలో రాష్ట్రపతి భవన్ నుంచి కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు. గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి బగ్గీని వినియోగించడం 40 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి. ఈ బండి వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలనా కాలంలో భారత దేశ వైస్రాయ్ దీనిని ఉపయోగించేవారు. అప్పటి వైస్రాయ్ ఎస్టేట్ (ప్రస్తుత ప్రెసిడెన్షియల్ ఎస్టేట్)లో ఈ బండిలో విహరించేవారు. బ్రిటిష్ పాలన అంతమై, భారత్, పాకిస్థాన్ వేర్వేరు దేశాలుగా ఏర్పాటైనపుడు ఈ విలాసవంతమైన బండి కోసం పోటీ జరిగింది. దీనిని దక్కించుకోవడానికి భారత్, పాక్ ప్రయత్నించాయి. చివరికి ఓ నాణేన్ని ఎగురవేసి, అదృష్టం ఎవరిని వరిస్తే వారిదే ఈ బగ్గీ అనే రాజీ మార్గానికి వచ్చారు. భారత దేశ కర్నల్ ఠాకూర్ గోవింద్ సింగ్, పాకిస్థాన్ కర్నల్ సాహబ్‌జాదా యాకూబ్ ఖాన్ నాణేన్ని ఎగురవేశారు. అదృష్టం భారత్‌ను వరించింది. దీంతో ఈ బండి భారత్‌కు లభించింది.

## నైట్రోజన్ గ్యాస్‌తో ఖైదీకి మరణ శిక్ష

**ప్రపంచంలో తొలిసారిగా అమెరికాలో అమలు**




అట్మోర్ (యూఎస్): వెయ్యి డాలర్లు తీసుకుని తన సహచరులతో కలిసి కిరాయికి ఒక మహిళను దారుణంగా చంపిన కేసులో అమెరికాకు చెందిన ఒక వ్యక్తికి ప్రపంచంలోనే తొలిసారిగా నైట్రోజన్ గ్యాస్ ద్వారా మరణ శిక్ష అమలుచేశారు. కెన్నెత్ యుగెన్ స్మిత్ (58) అనే దోషికి గురువారం రాత్రి 8.25 గంటలకు అలబామా జైలులో ఈ శిక్ష అమలు పరిచారు. అతని ముఖానికి ఫేస్ మాస్క్ అమర్చి దాని ద్వారా స్వచ్ఛమైన నైట్రోజన్ గ్యాస్ పంపారు. అది పీల్చుకున్న రెండు నిముషాల తర్వాత ఆయన మరణించాడు. దీంతో 22 నిముషాల తర్వాత ఆయన మరణాన్ని అధికారికంగా ప్రకటించారు. 1982 నుంచి దేశంలో మరణ శిక్షలు అమలు చేస్తున్న అమెరికాలో నైట్రోజన్ గ్యాస్ ద్వారా మరణ శిక్షను విధించడం దేశంలోనే కాదు ప్రపంచంలోనే తొలిసారి. సాధారణంగా అమెరికాలో విషం ఇంజక్షన్ ద్వారా మరణ శిక్షను అమలు చేస్తున్నారు.

## దేశంలో 96 కోట్ల మంది ఓటర్లు

- 47 కోట్ల మంది మహిళలు
- కొత్త ఓటర్లు 1.73 కోట్ల మంది
- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 26: త్వరలో జరుగనున్న 18వ లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 96 కోట్ల మందికి పైగా పౌరులు ఓటేసేందుకు అర్హులుగా ఉన్నారు. వీరిలో 47 కోట్ల మంది మహిళలు ఉన్నారని, మొత్తం ఓటర్లలో 1.73 కోట్ల మందికి పైగా 18-19 ఏండ్ల వయస్కుల వారేనని ఎన్నికల సంఘం పేర్కొన్నది. ఓటర్ల జాబితాలో నమోదైన వారిలో దాదాపు 18 లక్షల మంది దివ్యాంగులు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు దేశవ్యాప్తంగా 12 లక్షలకు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం దాదాపు 1.5 కోట్ల మంది ఎన్నికల సిబ్బందిని కేటాయించనున్నారు.




## రేపు సీఎంగా మళ్లీ ప్రమాణం?

- బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నితీశ్
- ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత సుశీల్ మోదీ
- బీహార్‌లో రాజకీయ వర్గాల ఊహాగానాలు
- నితీశ్‌ను చేర్చుకొనేందుకు బీజేపీ అధిష్ఠానం సిద్ధం
- ఈ సారి నితీశ్ ఎత్తులు సాగనివ్వం.. స్పీకర్ మా వాడే
- సర్కార్‌ను నిలుపుకొనేందుకు లాలూ యాదవ్ ఎత్తులు
- జీతన్ రాం మాంఝీ పార్టీకి డిప్యూటీ సీఎం పదవి ఆఫర్
- బీజేపీతో టచ్‌లో 10 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు!



పాట్నా: బీహార్‌లో రాజకీయ పరిణామాలు ఆసక్తిని రేపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ, లాలూ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ పార్టీల మధ్య విభేదాలు పొడసూపిన నేపథ్యంలో తదుపరి చోటుచేసుకోబోయే పరిణామాల పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం నుంచి నితీశ్ వైదొలగడం ఖాయమని, ఆయన తిరిగి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. నితీశ్ ఆదివారం రోజున 9వసారి తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని, డిప్యూటీ సీఎంగా బీజేపీ నాయకుడు సుశీల్ మోదీ ప్రమాణం చేసే అవకాశాలున్నాయని వెల్లడించాయి. మరోవైపు లాలూ యాదవ్ బల సమీకరణ యత్నాల్లో భాగంగా నాలుగు సీట్లున్న జీతన్‌రాం మాంఝీ పార్టీకి డిప్యూటీ సీఎం పదవిని ఆఫర్ చేశారు. జీతన్‌రాం ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో ఉన్నారు. ఈ పరిణామాలపై సుశీల్ మోదీ స్పందిస్తూ.. 'మూసుకున్న తలుపులు తెరుచుకోవచ్చు', 'రాజకీయాల్లో ఏమైనా జరుగొచ్చు' అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా నితీశ్ తన వైఖరిని స్పష్టం చేయాలని లాలూ యాదవ్ డిమాండ్ చేశారు. మరోవైపు, నితీశ్ గనుక రాజీనామా చేసి స్నేహ హస్తం అందిస్తే.. వెంటనే ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను ప్రతిపాదించడంలో ఆలస్యం చేయకూడదని బీజేపీ అధిష్ఠానం బీహార్ నేతలను ఆదేశించింది. పాట్నాలో శనివారం నుంచి ప్రారంభం కానున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామని పార్టీ వర్గాలు తెలిపాయి. బీహార్ పరిణామాలను గమనిస్తున్నామని, ఈ సారి నితీశ్‌కుమార్ తిరిగి బీజేపీ కూటమిలో చేరడం అంత సులభం కాదని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈసారి ఉన్న అసెంబ్లీ స్పీకర్ తమ (ఆర్జేడీ) వాడు అని అన్నారు. గత ఏడాది జేడీయూ నుంచి విడిపోయి సొంత కుంపటి పెట్టుకున్న ఉపేంద్ర కుశ్వాహా మాట్లాడుతూ.. 'నితీశ్‌కుమార్ ఎన్డీయే కూటమిలో చేరడంపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. ఆర్జేడీ, కాంగ్రెస్ పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అయితే మేము బీజేపీతో కలిస్తే లోక్‌సభ ఎన్నికల తరువాత కూడా ఆ ఐక్యత కొనసాగుతుందా అన్నది అతి పెద్ద ప్రశ్న' అని వ్యాఖ్యానించారు. రెండు మూడు రోజుల్లో నితీశ్ ఎన్డీయే గూటికి చేరడం మాత్రం ఖాయమని ఈ పరిణామాలను పరిశీలిస్తున్న విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, 10 మందికిపైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు విశ్వయనీయ వర్గాలు వెల్లడించాయి.

**నితీశ్ పీఎం అయ్యేవారు**

నితీశ్‌కుమార్ 'ఇండియా' కూటమిలోనే కొనసాగితే ఆయన ప్రధాని అయ్యేందుకు అవకాశాలు ఉండేవని సమాజ్‌వాదీ పార్టీ నేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఓ టీవీ చానెల్‌తో ఆయన మాట్లాడుతూ.. 'ఇండియా కూటమిలో ప్రధాని పదవికి ఎవరినైనా పరిశీలించే అవకాశాలున్నాయి. సరైన మద్దతు లభిస్తే నితీశ్‌కుమార్ ప్రధాన పోటీదారుగా ఉండేవారు' అని అన్నారు. ఇండియా కూటమి ఏర్పాటుకు నితీశ్ ప్రోద్బలమే కారణమని, ఆయన తమతోనే ఉండటం మంచిదని అన్నారు.

**ఆఫర్ తిరస్కరించిన సంతోష్ మాంఝీ**

ఆర్జేడీ నేత లాలూ యాదవ్ ఇల్లు పార్టీ నేతల రాకపోకలతో శుక్రవారం సందడిగా మారింది. ఎలాగైనా ప్రభుత్వం చేజారిపోకుండా చూసేందుకు ఆయన అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం ఆయన హెచ్ఏఎం పార్టీ నేత జీతన్‌రాం మాంఝీ కుమారుడు సంతోష్ మాంఝీకి డిప్యూటీ సీఎం పదవిని ఆఫర్ చేసినట్టు వెల్లడించాయి. అయితే ఈ ఆఫర్‌ను సంతోష్ మాంఝీ తిరస్కరించారు.



## వాహనాల మధ్య సాంకేతిక ముచ్చట!

**రోడ్డు ప్రమాదాల నివారణకు ఐఐటీ జోధ్‌పూర్ సరికొత్త ఆవిష్కరణ**

జోధ్‌పూర్, జనవరి 26: రోడ్లు ఎలా ఉన్నాయ్? ట్రాఫిక్ జామ్ ఏర్పడిందా? ఆ మార్గంలో యాక్సిడెంట్లు ఏమన్నా జరిగాయా? ఇలాంటి విషయాలను వాహనాలు పంచుకుంటాయ్! తద్వారా ట్రాఫిక్ రద్దీతో పాటు రోడ్డు ప్రమాదాలు తగ్గిపోతాయ్!! ఏంటీ ఆశ్చర్యంగా ఉందా? అవును మీరు చదివింది నిజమే. ఇంటర్నెట్ ఆఫ్ వెహికిల్స్ (ఐఓవీ) నెట్‌వర్క్ ఆధారంగా వాహనాల మధ్య సమాచారాన్ని పంచుకొనే సరికొత్త టెక్నాలజీని ఐఐటీ జోధ్‌పూర్ పరిశోధకులు ఆవిష్కరించారు. నావెల్ ఎంఏసీ బేస్డ్ అథెంటికేషన్ స్కీమ్ (నోమాస్) అనే సాంకేతికతను అభివృద్ధి చేసి వాహనాల్లో ఇన్‌స్టాల్ చేశారు. దీని ద్వారా రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాల మధ్య రియల్‌టైంలో సమాచార బదిలీ జరిగి తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని దీన్ని అభివృద్ధి చేసిన ఐఐటీ జోధ్‌పూర్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దేబాశిష్ దాస్ తెలిపారు. వాహనాల దొంగతనం, అనధికార వినియోగానికి ఈ సాంకేతికతతో చెక్ పెట్టొచ్చని వెల్లడించారు.



## 50 ఫోన్లు, 12 ల్యాప్‌టాప్స్, ఓ డిలీటెడ్ మెయిల్

**రష్మిక 'డీప్‌ఫేక్' నిందితుడిని ఎలా పట్టుకొన్నారంటే?**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ప్రముఖ నటి రష్మిక మందన్నా డీప్‌ఫేక్ కేసులో ప్రధాన నిందితుడిని ఢిల్లీ పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని గుంటూరుకు చెందిన ఈమని నవీన్ (24)ను అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. ఇతడే రష్మిక వీడియోను సృష్టించినట్టు అనుమానిస్తున్నట్టు తెలిపారు. అయితే, నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు వ్యూహాత్మకంగా ఓ పెద్ద మిషన్‌నే నిర్వహించినట్టు అర్థమవుతున్నది. ఈ మిషన్‌లో భాగంగా పోలీసులు ఏకంగా 50 ఫోన్లు, 12 ల్యాప్‌టాప్స్, పలు కాల్ రికార్డులు, డిలీట్ చేసిన సోషల్‌మీడియా ఖాతాలు, ఓ డిలీటెడ్ ఈ మెయిల్‌ను క్షుణ్ణంగా విశ్లేషించినట్టు సమాచారం.

**పట్టుకొన్నారిలా..**

ఈ ఘటనపై నవంబర్ 10న పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, యూజర్ల నుంచి ఫిర్యాదులు అందడంతో అభ్యంతరకరమైన ఆ వీడియోను పలు పేజీల నుంచి ఇన్‌స్టాగ్రామ్ తొలగించింది. కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్ఎస్‌వో) బృందం.. ఢిల్లీలోని నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌తో కలిసి రివర్స్ అనలైజింగ్ సాంకేతికతతో రష్మిక నకిలీ వీడియోల షేరింగ్‌ను విశ్లేషించాయి. తద్వారా ఈ వీడియో ఏ డివైజ్ నుంచి తొలుత షేరింగ్ అయిందో తెలుసుకొనే ప్రయత్నం చేశారు. దాదాపు 500 సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా విశ్లేషించిన బృందం.. చివరకు 20 మందిని ప్రశ్నించింది. పోలీసులకు మెటా బృందం సహకరించింది. అయితే, పోలీసుల విచారణకు హాజరైన పలువురు.. తాము ఆ వీడియోను ముందుగా ఎక్కడ చూశాం? ఎక్కడ నుంచి డౌన్‌లోడ్ చేశాం? అనే విషయాలను చెప్పలేకపోయారు. దీంతో 40-50 ఫోన్లు, 10-12 ల్యాప్‌టాప్స్‌ను స్వాధీనం చేసుకొన్న పోలీసులు వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించారు. రష్మిక పేర ఉన్న ఫ్యాన్ పేజీలు, ఐపీ అడ్రస్‌ల వివరాలను పోలీసులు సేకరించారు. నవీన్‌ను అరెస్ట్ చేయడానికి రెండు రోజుల ముందు వరకు కూడా అతడే ఈ పని చేశాడా? అనే విషయంపై ఢిల్లీ పోలీసులు ఓ నిశ్చితాభిప్రాయానికి రాలేకపోయారు.

**డిలీట్ చేసి దొరికిపోయాడు..**

రష్మిక పేరుతో కొన్నాళ్లు ఫ్యాన్స్ పేజీని నడిపిన నవీన్ లక్షకు పైగా ఫాలోవర్లను సంపాదించాక హఠాత్తుగా ఆ పేజీని డిలీట్ చేయడం, పేజీని సృష్టించేందుకు వినియోగించిన ఈమెయిల్ అడ్రస్‌ను రద్దు చేయడం, రష్మిక ఫేక్ వీడియో, షేరింగ్ నంబర్ డాటాను కూడా తొలగించడంతో పోలీసుల అనుమానం నిజమైంది. ఐపీ అడ్రస్ ద్వారా నవీన్ ప్రాంతాన్ని ఎట్టకేలకు గుర్తించి చివరకు అదుపులోకి తీసుకొన్నారు.